సాక్షి
సూర్యాపేట

శనివారం । 31 । ఆగస్టు । 2024



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్
చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను కట్టంగూర్ మండల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3,12,097 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 2,62,430 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,354 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,633 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,280 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 643.30 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 322.56 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 562.01 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 262.84 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 238.98 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

మంత్రి ఉత్తమ్ పర్యటన వాయిదా

హుజూర్‌నగర్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చింతలపాలెం, మఠంపల్లి మండలాల్లో శుక్రవారం తలపెట్టిన పర్యటన వాయిదా పడింది. వచ్చే నెల 6న ఇదే మండలాల్లో పర్యటన ఉంటుందని మంత్రి పీఆర్‌ఓ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురు జడ్జీలకు పదోన్నతి

చివ్వెంల: జిల్లాలో ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జి(జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్)లకు సీనియర్ సివిల్ జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో సూర్యాపేట, కోదాడ కోర్టుల్లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీలుగాగా విధులు నిర్వహిస్తున్న కామిశెట్టి సురేష్, ఎస్.శ్యాం సుందర్, అలాగే తుంగతుర్తి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ పదోన్నతి పొందారు. వీరికి ఆయా కోర్టుల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

7వ తేదీ వరకు అడ్మిషన్లు పొందొచ్చు



మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెప్టెంబర్ 7వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈఓ) భానునాయక్ తెలిపారు. శుక్రవారం తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కళాశాలలో 25 అడ్మిషన్లు పూర్తయ్యాయని, మరో 15 అడ్మిషన్లు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజమనోహర్‌రావు, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం దామెర శ్రీనివాస్, ఎల్సోజు నరేష్, గాదరబోయిన లింగయ్య, పులిగిల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

అర్వపల్లి: వైద్య ఆరోగ్య శాఖ చేపట్టే ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం ఆ శాఖ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన వైద్య సిబ్బంది నెలవారి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మణిదీప్, సీహెచ్‌ఓ బిచ్చు నాయక్, సూపర్‌వైజర్ లలిత పాల్గొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

సూర్యాపేట టౌన్: కల్లుగీత కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవింద్ అధ్యక్షత నిర్వహించి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్పొరేషన్‌ను టూరిజం శాఖ నుంచి టాడీ కార్పొరేషన్‌కు అప్పగించాలన్నారు. అనంతరం సంఘం కండువాలు, జెండాలను సీనియర్ నేత చింతల మల్లేశం గౌడ్ పంపిణీ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయ్య, గౌని వెంకన్న, గాలి అంజయ్య, రాష్ట్ర కార్యదర్శులు యస్ రమేష్ గౌడ్, బూడిద గోపి, బండకింది అరుణ్, గాలి అంజయ్య, బోడపట్ల సుదర్శన్, కొండ వెంకన్న, రాగి కృష్ణయ్య, వై.వెంకన్న పాల్గొన్నారు.

వీడని సందిగ్ధం

ఎటూ తేలని పంచాయతీ రిజర్వేషన్లు

- ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ
- పోటీకి సిద్ధమవుతున్న మాజీ సర్పంచ్‌లు
- ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు బిజీబిజీ



తొండ గ్రామ పంచాయతీ కార్యాలయం

తిరుమలగిరి (తుంగతుర్తి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్ల పీట ముడి ఇంకా వీడలేదు. ఓ వైపు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపొందించే పనిలో జిల్లా అధికార యంత్రాంగం తలమునకలైంది. మరోవైపు ఎన్నికల బరిలో దిగాలనుకునేవారు మాత్రం తమ అనుచరులతో పావులు కదుపుతున్నారు. మాజీ ప్రజా ప్రతినిధులు సైతం మళ్లీ పోటీ చేయాలనే ఆలోచనతో తమ బలాన్ని నిలుపుకునే దిశగా ప్రణాళికలు రచించుకుంటున్నారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇప్పటికీ తేలకపోవడంతో ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇది క్లియర్ అయితేనే తమ ప్రయత్నాలు ముమ్మరం చేసుకోవచ్చని వారు భావిస్తున్నారు.

కొత్త విధానంపై సమాలోచనలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమలయ్యేలా చట్టం చేసింది. ఐదేళ్ల క్రితం దాని ప్రకారంగా ఎన్నికలు జరిగాయి. ఆ చట్టం ప్రకారం చూస్తే ప్రస్తుతం పాత రిజర్వేషన్లే అమలు కావాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త విధానం అమలు చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పాత రిజర్వేషన్లు రద్దు చేసి కొత్తవి ఎలా అమలు చేస్తారనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ అదే జరిగితే ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మరోవైపు వార్డుల వారీగా ఓటర్లను విభజించి కుటుంబంలో ఓటు హక్కు కలిగిన వారినందరినీ ఒకే చోట ఉండేలా జాబితా తయారు చేస్తున్నారు. జిల్లాలో 475 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చేనెల 21వ తేదీన తుది జాబితా ప్రకటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన జరిగిన తరువాతే రిజర్వేషన్లు ఖరారు చేస్తామని, అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

475 పంచాయతీల్లో..

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా గత ఎన్నికల్లో ఓసీ జనరల్, ఓసీ మహిళలకు కలిపి 202 పంచాయతీలు రిజర్వు చేశారు. బీసీ జనరల్, బీసీ మహిళలకు కలిపి 65, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళలకు కలిపి 97, ఎస్టీ జనరల్, ఎస్టీ మహిళలకు కలిపి 101 పంచాయతీలు రిజర్వు చేశారు.

గత ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇలా

కేటగిరీ	పంచాయతీల సంఖ్య
ఓసీ జనరల్	101
ఓసీ మహిళ	101
బీసీ జనరల్	32
బీసీ మహిళ	33
ఎస్సీజనరల్	48
ఎస్సీమహిళ	49
ఎస్టీ జనరల్	55
ఎస్టీ మహిళ	56
మొత్తం	475

సాగునీటి ప్రాజెక్టులకు ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం



భువనగిరిలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

- మూసీ కాల్వల ఆధునీకరణకు భూ సేకరణ సమస్య ఉంది
- ఎమ్మెల్యేలు పరిష్కరిస్తే ఏడాదిలోపే పూర్తి చేస్తాం
- సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యమిస్తుంది.. ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉంది.. పాత, కొత్త ప్రాజెక్టులు అనే తేడా లేకుండా తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు స్థిరీకరించాలన్నది లక్ష్యం.. అని రాష్ట్ర నీటి పారుదల, సివిల్ సప్లై శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. భువనగిరిలో శుక్రవారం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయిలో సాగునీటి ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధితో పాటు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం నా ధర్మమన్నారు. పెండింగ్‌లో ఉన్న బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ఆధునీకరణతోపాటు గంధమల్ల రిజర్వాయర్‌కు కూడా నిధులు కేటాయించి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. వీటితో పాటు ఎత్తిపోతల పథకాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. అయితే భూసేకరణకు సమస్యలు ఎదురవుతున్నదున, ఎమ్మెల్యేలు ముందుండి పరిష్కరిస్తే ఏడాదిలోనే పూర్తి చేయవచ్చన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాగునీటి ప్రాజెక్టుల పనులను అధికారులు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్(తీన్మార్ మల్లన్న), మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు

హెలిపాడ్ వద్ద మంత్రులకు ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. సమీక్ష సమావేశం సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిపాడ్ వద్దకు ఎవరినీ అనుమతించలేదు. సమావేశ హాల్ వద్ద బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించి లోపలికి పంపించారు. డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. సమావేశం రెండు గంటలు ఆలస్యంగా మొదలుకావడంతో ప్రాంగణంలోకి వచ్చిపోయే వారిని క్షుణంగా పరిశీలించారు.

2026 నాటికి దేవాదుల పూర్తి : మంత్రి శ్రీనివాస్‌రెడ్డి



రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఎనిమిది నెలలే పూర్తయ్యిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నెరవేరుస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 16 ఏళ్ల క్రితం సోనియాగాంధీ శంకుస్థాపన చేసిన దేవాదుల ప్రాజెక్టు వద్దకు శుక్రవారం ఉదయం వెళ్లామని, 2026 మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తిచేసి సోనియాగాంధీతో ప్రారంభోత్సవం చేయించి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా దాదాపు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ధరణి ప్రక్షాళన, ల్యాండ్ రెవెన్యూ చట్టాన్ని దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

మూసీ కాలువల ఆధునీకరణతోనే ఫలితాలు : ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



జిల్లాలో ప్రధాన సాగు నీటి వనరులైన మూసీ కాల్వలను ఆధునీకరిస్తేనే రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం ఉంటుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాల్వల భూసేకరణకు ఎమ్మెల్యేలు కలిసి కృషి చేయాలని సూచించారు.

రుద్రమచెరువును రిజర్వాయర్ చేయండి : మందుల సామేల్



తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా కోరుతున్న రుద్రమచెరువును రిజర్వాయర్ చేయాలని, బునాదిగాని కాలువతోపాటు అసిఫ్ నహర్‌కాలువకు రూ.5కోట్లు కేటాయించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. అలాగే కేతిరెడ్డి ప్రాజెక్టు నుంచి కాలువ తీస్తే ఎనిమిది గ్రామాల పరిధిలో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నారు. అమ్మనబోలు నుంచి చిత్తలూరు వరకు ఐదు చెక్ డ్యాంలు ఏర్పాటు చేస్తే దాదాపు లక్ష ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. శాలిగౌరారం, మాదారం, ఇటుకులపహాడ్ ప్రాజెక్టు పనులు, ఎస్సారెస్పీ 27 కిలో మీటర్ల లైనింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు.

పోలీస్ కుటుంబాలకు 'చేయూత'



శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: పోలీస్ శాఖలో అమలు చేస్తున్న చేయూత పథకం అమర పోలీస్ కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి చేయూత పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చేయూత పథకానికి ప్రతినెలా విరాళాలు అందిస్తున్న జిల్లా పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ గౌడ్, ఏఓ మంజు భార్గవి, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి

భానుపురి: ప్రజలకు అండగా ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషిచేయాలని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, నాయకులు పానుగోటి సూర్యనారాయణ, కొల్లు కృష్ణారెడ్డి, సుమన్, రాజు, బచ్చలకూర గోపి, శ్రీనివాస్, సతీష్, బొమ్మగాని వినయ్, ఫరీరుద్దీన్, మల్సూర్ నాయక్, శ్రీనునాయక్, మధుసూదన్‌రెడ్డి, గోపి, యాకూబ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ అశోక్

నాగారం: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) అశోక్ అన్నారు. శుక్రవారం నాగారం మండలం ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. పిల్లలను పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, ఎంఈఓ బాలు నాయక్, ఎంపీఓ మారయ్య, నోడల్ అధికారి వాసం ప్రభాకర్, జీహెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు యాకయ్య, రమేష్, కృష్ణమూర్తి, కలమ్మ, నవీన్, మహేశ్వరి, గ్రామస్తులు ఆలకుంట్ల బాలకృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, శ్రీస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణం చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తప్పుల్లేకుండా ఉండాలి

- అదనపు కలెక్టర్ బీఎస్ లత



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

ఆత్మకూర్ (ఎస్): గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం ఆమె ఆత్మకూర్(ఎస్) ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి రికార్డులు పరిశీలించారు. ఆయా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ త్వరితగతిన ఓటరు నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని, ధరణి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ హసీమ్, తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంపీఓ బీసు రాజేష్, వెంకటాచారి, డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, ఆర్ఐ స్వప్నస్వామి, హస్సేన్ పాల్గొన్నారు.

'శ్రావణ' చివరి పూజలు





సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు, శ్రీదత్తసాయి మందిరంలో పూజలు చేస్తున్న మహిళలు

అభ్యసన సామర్థ్యాలు పెంచేలా..

- ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కూడా ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం కొనసాగింపు
- ఇకనుంచి మూడు నెలలకోసారి పరీక్షలు
- అధికారులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పూర్తి
- రెండు రోజులుగా బేస్డ్ లైన్ టెస్ట్ నిర్వహణ



హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ రాష్ట్ర స్థాయి శిక్షణకు వెళ్లిన జిల్లా విద్యా శాఖ అధికారులు

సూర్యాపేట టౌన్: ప్రతి విద్యార్థిలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచాలనే లక్ష్యంతో విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటివి కనీస సామర్థ్యాలు. కానీ అనేక పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతోపాటు విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ఫలితంగా డ్రాపౌట్‌లు అధికమవుతున్నారు. దీనిని గమనించిన ప్రభుత్వం విద్యా ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేలా కార్యాచరణ సిద్ధం చేసింది.

పాఠశాలల వివరాలు

ప్రాథమిక	698
ప్రాథమికోన్నత	78
ఉన్నత	234
మోడల్ స్కూళ్లు	09
కేజీబీవీలు	23
గురుకులాలు	04
విద్యార్థులు	62,000

గతేడాది ప్రక్రియే ఈసారి కూడా..

గతేడాది ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషన్ ఇన్ లిటరసీ అండ్ న్యూమరసీ), హైస్కూల్ విద్యార్థులకు ఎల్‌ఈపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాలు అమలు చేసింది. ఉత్తమ ఫలితాలు రావడంతో వీటినే స్వల్ప మార్పులు చేసి ఈ విద్యా సంవత్సరం కూడా కొనసాగించాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారులు జిల్లా విద్యా శాఖ అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. తరగతుల వారీగా ప్రణాళికల్లో మార్పులు చేసి ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు బేస్డ్ టెస్ట్(ప్రారంభం పరీక్ష) నిర్వహించి ఫలితాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేస్తారు. ఈనెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

మూడు నెలలకోసారి పరీక్ష

కనీస విద్యా సామర్థ్యాలైన మౌఖిక పఠనం(ఓరల్ రీడింగ్), పటిష్టమైన పఠనం (ఫ్లూయెన్సీ రీడింగ్), కాంప్రహెన్సివ్ రైటింగ్, తరగతిని బట్టి గుణింతాలు, భాగాహారాలు, లెక్కలు చేయడం వంటివి విద్యార్థులకు రావాల్సి ఉంటుంది. అందుకోసం జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. గతంలో నెలకోసారి పరీక్ష ఉండేది. ఇప్పుడు మూడు నెలలకోసారి నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా బేస్డ్ లైన్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. శనివారం కూడా నిర్వహించనున్నారు. డిసెంబర్‌లో మిడ్‌లైన్ టెస్ట్, మార్చిలో ఎండ్‌లైన్ టెస్ట్ నిర్వహించాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఫలితాలను ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారులు, హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

పక్కాగా అమలు చేస్తాం

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తాం. విద్యా శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రణాళికలు రూపొందిస్తాం. హెచ్‌ఎంలు, మానిటరింగ్ అధికారులు పర్యవేక్షణ అంశాలను స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపర్చాలి. ఉపాధ్యాయులకూ ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

ఉపాధ్యాయులు చేయాల్సినవి..

ప్రతి ఉపాధ్యాయుడు విధిగా 6 నుంచి 9వ తరగతి వరకు బోధించే సబ్జెక్టుల వార్షిక ప్రణాళికను రూపొందించాలి. సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వీయ పరిశీలన పత్రం(సెల్ఫ్ అప్రోజల్) నమోదు చేసుకొని స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపర్చాలి. తరగతుల వారీగా నిర్దేశించిన అభ్యసన ఫలితాలు సాధించడంతోపాటు నిర్ణీత సమయంలోగా సిలబస్ పూర్తిచేయాల్సి ఉంది.

క్లుప్తంగా

పోలీసు విధులకు ఆటంకం.. ఐదుగురిపై కేసు నమోదు

చౌటుప్పల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురు వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధికి చెందిన యువకుడు, రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. రక్షణ నిమిత్తం గురువారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. రాత్రి కావడంతో ప్రేమజంటను తాళ్లసింగారంలోని యువకుడి ఇంటికి పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో తీసుకెళ్తుండగా.. యువతి కుటుంబ సభ్యులు తాళ్లసింగారం గ్రామ శివారులో పెట్రోలింగ్ వాహనానికి అడ్డు తగిలి యువతిని తీసుకెళ్లారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురు వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా యువతిని పోలీసులు అదుపులోకి తీసుకుని చౌటుప్పల్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల: మునగాల శివారులో సాగర్ ఎడమ కాలువలో గురువారం గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు స్థానిక ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన గట్టికొప్పుల గోపాల్‌రెడ్డి(40) గత కొన్నేళ్లుగా కుటుంబంతో కలిసి కోదాడలో నివాసముంటున్నాడు. గురువారం బైక్‌పై తన స్వగ్రామం ఆత్మకూర్(ఎస్)కు వచ్చి తిరిగి కోదాడకు వెళ్తూ మునగాల శివారులో సాగర్ ఎడమ కాలువలో ఈత కొట్టేందుకు దిగి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, ఎన్‌ఎస్‌పీ అధికారులు కాలువ వెంట గాలించగా.. శుక్రవారం నడిగూడెం మండలం చాకిరాల బ్రిడ్జి వద్ద కాలువలో గోపాల్‌రెడ్డి మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



శివకుమార్ (ఫైల్)

తిప్పర్తి: బైక్‌పై వెళ్తున్న యువకుడిని లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన మండలి శివకుమార్ (26) బైక్‌పై నల్లగొండ నుంచి తిప్పర్తి వైపు వస్తుండగా.. దుప్పలపల్లి సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వివాహం కాలేదు.

పర్వతారోహకురాలు అన్వితకు విరాళం



అన్వితారెడ్డికి చెక్కు అందజేస్తున్న ఏజీఐ గ్రీన్ ప్యాక్ సంస్థ సభ్యులు, ఎమ్మెల్యేలు

భువనగిరి రూరల్ : పర్వతారోహకురాలు అన్వితారెడ్డికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏజీఐ గ్రీన్ ప్యాక్ సంస్థ ముందుకొచ్చింది. పర్వతారోహణలో మరింత ప్రోత్సహించేందుకు గాను ఖర్చులు, సన్నాహాలకు రూ.3 లక్షల విరాళం అందజేసింది. శుక్రవారం ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశంతో కలిసి అన్వితారెడ్డికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐ గ్రీన్ ప్యాక్ ప్రతినిధి గోవింద్‌జీరాయ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మయంక్‌పాలక్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లు గడుస్తున్నా అందని పరిహారం

- విధి నిర్వహణలో విద్యుదాఘాతంతో రెండు చేతులు కోల్పోయిన గ్రామ మల్టీపర్పస్ వర్కర్
- ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందక.. పింఛన్ రాక ఇబ్బందులు
- పూట గడవడం కష్టంగా మారడంతో బిచ్చగాడిగా మారిన వైనం



మిర్యాలగూడ పట్టణంలో భిక్షాటన చేస్తున్న ఇస్లావత్ కిషన్



కుటుంబ సభ్యులతో ఇస్లావత్ కిషన్

మిర్యాలగూడ అర్బన్: గ్రామ మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలతో ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబ పెద్దను అనుకోని విద్యుత్ ప్రమాదం ఆ ఇంటి పెద్దను జీవచ్ఛవంగా మార్చింది. ఈ ఘటన జరిగి మూడేళ్లు గడుస్తున్నా పరిహారం అందక, పింఛన్ రాక ఇబ్బందులు పడుతున్నారు. మిర్యాలగూడ మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ కిషన్ గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. 2021లో గ్రామ లైన్‌మెన్ ఆదేశాల మేరకు గ్రామంలో కిషన్ విద్యుత్ బల్బులు మారుస్తుండగా విద్యుదాఘాతానికి గురై రెండు చేతులూ కోల్పోయాడు. అప్పటి నుంచి కిషన్ భార్య శాంతి కూలి పనికి వెళ్తూ తన ఇద్దరు పిల్లలను పోషిస్తుండగా.. కిషన్ మాత్రం ఇంటికి భారం కాలేక బిచ్చగాడిగా మారి మిర్యాలగూడ పట్టణంలో బిచ్చమెత్తుకుంటున్నాడు.

రెండు శాఖల మధ్య సమన్వయ లోపం..

విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో కిషన్ నేటికీ ప్రభుత్వ సాయానికి నోచుకోలేదు. కిషన్ మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తుండడంతో పంచాయతీరాజ్ శాఖ నుంచి పరిహారం ఇస్తారని విద్యుత్ అధికారులు చెబుతుండగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు మాత్రమ విద్యుత్ శాఖ నుంచే పరిహారం అందించాలని అంటున్నారు. దీంతో కిషన్ కుటుంబానికి ఎటువంటి సాయం అందక ఇబ్బందులు పడుతున్నారు. వికలాంగుల పింఛన్ అయినా ఇవ్వాలని కోరుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పింఛన్ అందడం లేదని కిషన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఇప్పటి వరకు సాయం అందలేదు



నేను రెండు చేతులు కోల్పోయి మూడేళ్లు గడుస్తున్నా నాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. సాయం చేయాలని విద్యుత్ అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినా నాకు న్యాయం జరగలేదు. కనీసం వికలాంగుల పింఛన్ అయినా ఇవ్వాలని కోరుతూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పింఛన్ రాలేదు. నా కుటుంబానికి భారం కాకూడదని భిక్షాటన చేస్తున్నాను. పాలకులు, అధికారులు స్పందించి నాకు న్యాయం చేస్తారని అనుకుంటున్నా.

– ఇస్లావత్ కిషన్

జీవితంపై విరక్తితో ట్రైనీ కానిస్టేబుల్ ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

చింతపల్లి: మానసిక సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగిన ట్రైనీ కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఎస్‌ఐ యాదయ్య, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన పాలకూర్ల సత్తయ్య, వెంకటమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఆంజనేయులు(25) ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోషామహాల్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల సెలవులు ఉండడంతో వారం క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఆంజనేయులు బుధవారం ఉదయం చింతపల్లి ఎక్స్ రోడ్ వద్ద పురుగుల మందు డబ్బా కొనుగోలు చేశాడు. అనంతరం వ్యవసాయ పొలం వద్ద స్నానం చేసి వస్తానని ఇంట్లో చెప్పి పొలం వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మాల్‌లోని పీపుల్స్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజుల నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి పాలకూర్ల సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన విద్యార్థినులు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు శుక్రవారం విద్యుదాఘాతానికి గురయ్యారు. 7వ తరగతి చదువుతున్న సాయిలహరి, ఐదో తరగతి చదువుతున్న సాయి ప్రసన్న మధ్యాహ్నం వాష్‌రూమ్‌కి వెళ్లారు. ఈ క్రమంలో వాష్‌రూమ్‌కి ఉన్న ఇనుప డోర్‌కు విద్యుత్ వైరు తగలడంతో విద్యుత్ సరఫరా జరిగి బాలికలు డోర్‌ను ముట్టుకోగానే విద్యుదాఘాతానికి గురయ్యారు. అక్కడే ఉన్న కరెంట్ మెకానిక్‌తో పాటు పలువురు హుటాహుటిన వెళ్లి విద్యార్థినులను చికిత్స నిమిత్తం తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇటీవల వాష్‌రూమ్‌ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి.

హోరాహోరీగా సెమీ ఫైనల్ పోటీలు

- నేటితో ముగియనున్న అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్



సెమీఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారిణి

భువనగిరి: భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న అండర్–18 అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలురు, బాలికల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ పోటీల్లో వివిధ దేశాలకు చెందిన టెన్నిస్ క్రీడాకారులు తలపడ్డారు.

బాలికల విభాగంలో విజేతలు వీరే..

సెమీఫైనల్స్‌లో బాలికల సింగిల్స్ విభాగంలో సోహిని సంజయ్ మొహింతి(ఇండియా) 6–1, 4–6, 6–3 తేడాతో రిషితరెడ్డి బసిరెడ్డి(ఇండియా)పై, స్నిగ్ధ కాంత(ఇండియా) 6–4, 6–2 తేడాతో దియా రమేష్(ఇండియా)పై విజయం సాధించారు. అదేవిధంగా డబుల్స్ విభాగంలో దియా రమేష్, సోహిని సంజయ్ మొహింతి(ఇండియా) 6–1, 6–4 తేడాతో ఆర్జాన్ ఖోరాకివాలా, అన్వీ పునగంటి (ఇండియా)పై, ఆస్మి అద్కర్, ఐశ్వర్య జాదవ్(ఇండియా), 6–1, 6–0 తేడాతో స్నిగ్ధ కాంత, జయ కపూర్(ఇండియా)పై గెలుపొందారు.

బాలుర విభాగంలో..

బాలుర సింగిల్స్ విభాగంలో సెహజ్ సింగ్ పవార్ (ఇండియా) 6–3, 6–2 తేడాతో వరుణ్ వర్మ(ఇండియా)పై, శంకర్ హిస్నామ్(ఇండియా) 6–4 ,6–2తో వెంకట్ రిషి బట్లంకి(అమెరికా)పై విజయం సాధించారు. అదేవిధంగా డబుల్స్ విభాగంలో సెహజ్ సింగ్ పవార్, వరుణ్ వర్మ(ఇండియా) 4–6, 6–1, 6–2 తేడాతో మన్నం అశోక్, ఓం పటేల్(ఇండియా)పై, వెంకట్ రిషి బట్లంకి(అమెరికా), మహాలింగం(ఇండియా) 7–6, 6–1 తేడాతో నైసిక్‌రెడ్డి, మహిర్ మేకల(ఇండియా)పై విజయం సాధించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె. శివరాంరెడ్డి



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు

- పరారీలో మరో ముగ్గురు
- 147.31 గ్రాములు బంగారం, 300 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

కట్టంగూర్: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను కట్టంగూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కె. కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ ఎన్. శ్రీనుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డి మండలం జంగారెడ్డి గ్రామానికి చెందిన పోలవరపు నాగదుర్గాప్రసాద్, భీమవరం జిల్లా తాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన యరసాని లక్ష్మణ్, శ్రీను, రాజీవ్ కలిసి ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామ పట్టణంలో రెండు ఇళ్లల్లో దొంగతనం చేశారు. అక్కడ చోరీ చేసిన బంగారాన్ని హైదరాబాద్‌లో అమ్మేందుకు రెండు బైక్‌లపై బయల్దేరారు. మార్గమధ్యలో 29వ తేదీ సాయంత్రం కట్టంగూర్ మండల శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఆగి గంజాయి తాగుతుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కట్టంగూర్ ఎస్‌ఐ వారిని గమనించాడు. తన సిబ్బందితో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా ముగ్గురు వ్యక్తులు ఒక బైక్‌పై పారిపోయారు. పోలవరపు నాగదుర్గాప్రసాద్ కూడా తప్పించుకోవడానికి ప్రయత్నించగా కానిస్టేబుళ్లు ఉదయ్‌కుమార్, దుర్గాప్రసాద్ కలిసి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయి, 14.73 తులాల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌తో స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో 30కి పైగా దొంగతనం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కొన్ని కేసుల్లో శిక్ష అనుభవించి వారం క్రితం రాజమండ్రి జైలు నుంచి బయటకు వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడిని నల్లగొండ కోర్టులో రిమాండ్ చేసినట్లు వివరించారు. పరారీలో ఉన్న యరసాని లక్ష్మణ్, శ్రీను, రాజీవ్‌ను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

ఇద్దరు కానిస్టేబుళ్లకు రివార్డు..

నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు ఉదయ్‌కుమార్, దుర్గాప్రసాద్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ రివార్డు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది సతీష్, మల్లేష్, శంకర్, సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం



గుండ్రాంపల్లి శివారులోని శ్రీపతి ల్యాబ్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



శ్రీపతి ల్యాబ్‌లో అగ్నిప్రమాదంతో హైదరాబాద్-విజయవాడ హైవే పైకి వ్యాపించిన పొగ

- కమ్ముకున్న దట్టమైన పొగ
- సురక్షితంగా కార్మికులు

చిట్యాల: చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులోని శ్రీపతి ల్యాబ్స్‌లో బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేసే క్రమంలో శుక్రవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పరిశ్రమలో బ్లాక్–2లో తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. ఈ పరిశ్రమలో బ్లాక్–2లో రెండంతస్తుల్లో ఉండగా దానిలో ఆరుకు పైగా రియాక్టర్‌ల ద్వారా రసాయన ద్రావణాలతో బల్క్ డ్రగ్స్ తయారు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆ బ్లాక్‌లో ఆరుగురు కెమిస్ట్‌లు, ఇద్దరు హెల్పర్‌లతో కలిపి ఎనిమిది మందికిపైగా పనిచేస్తుండగా ఐదుగురు షిప్టు మారేందుకుగాను బయటకి వెళ్లారు. ఇదే సమయంలో రియాక్టర్‌కు సరఫరా అవుతున్న పైపులైన్‌లోని పలు రసాయన ద్రావణాలు లీకయ్యాయి. దీంతో ఆ బ్లాక్‌లో దట్టమైన పొగ వ్యాపించటంతో పాటు అకస్మాత్తుగా మంటలు లేచాయి. దీంతో వెంటనే ఆ బ్లాక్‌లోని కార్మికులు అప్రమత్తమై బయటికి పరుగెత్తారు. పరిశ్రమ సమీపంలో వ్యాపించిన పొగ హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై కమ్ముకుని వాహనదారులకు రోడ్డు కనిపించనంతగా మారిపోయింది. అనంతరం ఫైరింజన్‌లకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. రెండతస్తుల్లోని బ్లాక్–2లో వ్యాపించిన మంటలను ఫైరింజన్‌లతో ఆర్పివేశారు. అనంతరం ఆ బ్లాక్–2లో మిగిలిపోయిన వెటర్నరీ బల్క్ డ్రగ్స్ ఉత్పత్తులను పరిశ్రమలోని కార్మికులు బయటికి తరలించారు. ఈ ప్రమాదంలో బ్లాక్–2లో భారీ ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాద సంఘటన స్థలానికి నార్కట్‌పల్లి సీఐ నాగరాజుతో పాటు చిట్యాల, నార్కట్‌పల్లి, మునుగోడు ఎస్‌ఐలు ఎస్.ధర్మా, క్రాంతి కుమార్, వెంకటేశ్వర్లు చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. శుక్రవారం సాయంత్రం వరకు దీనిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని చిట్యాల ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

తిరుమలగిరి మార్కెట్‌కు పెసర్ల రాక



తిరుమలగిరి మార్కెట్‌లో పెసర్ల రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు పెసర్ల రాక మొదలైంది. శుక్రవారం 1,040 బస్తాల పెసర్లు వచ్చినట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. కాగా క్వింటా పెసర్లు గరిష్టంగా రూ.7,847, కనిష్టంగా రూ.5,300 ధర పలికినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇందిర ఫెలోషిప్ క్యాంప్‌లో గోదాసు శిరీష

రామన్నపేట: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండలం రాంపల్లిదాయార గ్రామంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఇందిర ఫెలోషిప్ బ్యాచ్ క్యాంప్‌లో రామన్నపేట తాజా మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పాల్గొన్నారు. స్థానిక సంస్థలు, చట్టసభల్లో మహిళల పాత్రపై ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సల్ల సౌజన్య తదితరులు శిరీషను సన్మానించారు.

పథకం ప్రకారమే హత్య

- తమ తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని సొంత బాబాయిని హత్య చేసిన అక్కాతమ్ముడు
- నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: తమ తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని సొంత బాబాయిని అక్కాతమ్ముడు కలిసి హత్య చేశారు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో జరిగింది. మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపురం గ్రామానికి చెందిన తేజావత్ జాను(40) మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో భిక్షమెత్తుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి వివాహం కాకపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 28న అతడు ఉండే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు విషయాన్ని మిర్యాలగూడ పట్టణంలో ఉంటున్న అతడి అన్న బనావత్ కృష్ణకు తెలిపారు. కృష్ణ వచ్చి ఇంటి లోపలికి వెళ్లి చూడగా మంచంపై కుళ్లిన స్థితిలో జాను మృతదేహం కనిపించింది. మద్యం మత్తులో కిందపడిపోయి చనిపోయాడనుకుని అదే రోజు మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. తన తమ్ముడు మృతికి సంబంధించి ఐలాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై అనుమానాలు ఉన్నాయని మరుసటిరోజు కృష్ణతో పాటు అతడి కుమారుడు సతీష్, కుమార్తె నాగమణి కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కృష్ణ అనుమానం వ్యక్తిన చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు పిలిపించి విచారించగా.. కృష్ణ కుమారుడు సతీష్, కుమార్తె నాగమణే జాను హత్య చేశారని వారు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు సతీష్, నాగమణిని విచారించగా.. తమ తల్లితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తామే తమ బాబాయికి ఈ నెల 25న మద్యం తాగించి తలపై రాయితో కొట్టి హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో శుక్రవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ నరేష్ తదితరులున్నారు.

నాగార్జునసాగర్ నుంచి వివిధ రాష్ట్రాలకు..

- స్థానికంగా గణపతి ప్రతిమలు తయారు చేసి ఎగుమతి చేస్తున్న ముస్లింలు



రంగులు వేసి ఆరబెట్టిన వినాయక ప్రతిమలు



అట్టపెట్టెలో ప్యాకింగ్ చేసిన ప్రతిమలు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో తయారుచేసిన గణపతి ప్రతిమలు వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణపతి ప్రతిమలను స్థానికంగా ముస్లింలు తయారుచేస్తుండడం విశేషం. చిన్న చిన్న ప్రతిమల నుంచి పెద్ద విగ్రహాల వరకు తయారు చేస్తుంటారు. వివిధ రకాల సైజుల్లో గల గణపతి ప్రతిమల అచ్చుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, నీటిని కలిపి పోసి ఆరబెడతారు. అవి ఆరగానే వాటిని కొంత పాలిష్ చేసి మిషన్‌తో రంగులు వేస్తారు. ఆ తర్వాత స్వతహాగా చేతితో విగ్రహానికి గల నేత్రాలు, ముక్కు, నోరు, చెవులు, తొండం, కిరీటం, ఆభరణాలకు రంగులు అద్దుతారు. ఆర్డర్ల మేరకు కోల్‌కతా, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు గణపతి ప్రతిమలను ఎగుమతి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి అయిపోయాక కొద్దిరోజులు విరామం తీసుకుని తిరిగి మెటీరియల్ ఆర్డర్ పెట్టి తెప్పించుకుని విగ్రహాలు తయారుచేస్తూనే ఉంటామని అన్నారు. తమతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.

వినాయక ప్రతిమలకు ప్రాణం కుంచె

వినాయక ప్రతిమల తయారీకి ప్రాణం కుంచె. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పౌడర్‌లో ఎంతమేరకు నీటిని కలపాలో కలిపి కుంచెలో పోసి ఆరపెడతాం. ఆరగానే వాటికి రంగులు వేస్తాం. అనంతరం ఫైనల్ టచ్ బ్రష్‌తో చేస్తాం. ఆరిపోగానే అట్టపెట్టెలలో ప్యాక్ చేసి ఎగుమతి చేస్తాం.

– షబ్బీర్, గణపతి ప్రతిమల తయారీదారుడు

బొమ్మలు తయారు చేయడమంటే ఇష్టం

గణపతి ప్రతిమలు తయారుచేయడమంటే చాలా ఇష్టం. రంగులు వేసేటప్పుడు కొంత వాసన వస్తుంది. కానీ అలవాటు అయ్యింది. బొమ్మలకు ఫైనల్ టచ్ చేసేటప్పుడు జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. గణపత ప్రతిమల తయారీతో ఉపాధి లభిస్తోంది.

– దస్తగిరి, గణపతి ప్రతిమల తయారీదారుడు

నగదు, సెల్‌ఫోన్ అపహరణ

చౌటుప్పల్: రహదారి పక్కన వాహనాన్ని నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్ వద్ద నగదు, సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శుక్రవారం చౌటుప్పల్ పట్టణ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడేనికి చెందిన శివ తన బొలేరో వాహనంలో చేపల లోడుతో గురువారం హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజాము తర్వాత చేపలు అన్‌లోడ్ అయ్యాక తిరిగి తాడేపల్లిగూడేనికి పయనమయ్యాడు. అతడికి నిద్ర వస్తుండడంతో మార్గమధ్యలో చౌటుప్పల్ పట్టణ శివారులో హైవే పక్కన వాహనం నిలిపాడు. తన వద్ద ఉన్న రూ.5వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను పౌచ్‌లో ఉంచి బొలేరో వాహనంలో డ్యాష్ బోర్డుపై పెట్టి నిద్రించాడు. కొంతసేపటి తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు పౌచ్‌ను ఎత్తుకెళ్లారు. నిద్ర లేచిన తర్వాత చూసుకోగా పౌచ్ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

అర్వపల్లి: అర్వపల్లికి చెందిన కట్టెల కృష్ణకు చెందిన ఆవు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. వ్యవసాయ బావి వద్ద మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు కృష్ణ తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వేములపల్లి(మాడుగులపల్లి) : రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాలు, రైతుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసి ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మాడుగులపల్లి మండలంలో వరదకాల్వ ద్వారా నీరు అందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడానని నాలుగైదు రోజుల్లో చివరి భూములకు నీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నాయకులు పాదిల శ్రీనివాస్, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పుల్లెంల సైదులు, పుల్లెంల నరసింహ, బట్టు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.